# కర్తవ్యం

నాకు తల్లి ఉన్నది. అక్క ఉన్నది. చెల్లెళ్ళున్నారు. మేనత్తలున్నారు. పిన్నులున్నారు. భార్యకూడా ఉన్నది.

నాకు స్త్రీ అంటే గౌరవం ఉండడానికి వీరంతా నాకుండడమే నా అన్న విషయం చెప్పలేను. కాని స్త్రీని గౌరవించని సంస్కృతి సంస్కృతి ఎలాగౌతుందీ అన్న ప్రశ్న నాకు తోచినంతగా ఇతరులకు ఎందుకు తోచదూ అనిపిస్తుంది నాకు,

నేను కాలేజీలో లెక్చరర్‌గా చేరినప్పుడు నాకూ సహోద్యోగులకీ ఈ విషయమై ఎన్నో గొడవలు జరుగుతూండేవి.

స్త్రీ పురుషులకు ఆకర్షణ సహజం. అందులో తప్పులేదు - అని నా కొలీగ్సు అనేవారు,

"స్త్రీ పురుషులకు ఆకర్షణ సహజమే గదా-సమాజం వివాహ వ్యవస్థను రూపొందించింది? ఆ ఆకర్షణ భార్యాభర్తలకు మాత్రమే పరిమితం కావాలి కదా-" అంటాను నేను,

నేనిలాగనడానికి కారణ మున్నది.

నా క్లాసులో సగం మంది ఆడపిల్లలు. చాలామంది నా అదృష్టాన్ని అభినందించే వారు, నాకు కోపం వచ్చేది.

"వాళ్ళు వినడంలేదుగదా-" అనే వారు వాళ్ళు.

"నీభార్య గురించి ఎవరో మాట్లాడుతుంటున్నారనుకో ఇలాగే - అది నీకు నచ్చుతుందా?" అంటాను నేను.

నచ్చుమట. నేనలా మాట్లాడ్డం వితండ వాదనట,

ఏమైతేనేం-నేను సహోద్యోగుల మధ్య లోకువయ్యాను. ప్రవరాఖ్యుడు, శ్రీరామచంద్రుడు - లాంటి పేర్లు కూడా నాకు వచ్చాయి. అయితే ఆపేర్లు నన్ను హేళన చేయడానికి ఉపయోగించబడేవి. అది నాకు బాధగానే ఉన్నా ఏమీ చేయలేక పోయేవాడిని.

ఇప్పుడు నాకు పన్నెండేళ్ళ కూతురు కూడా ఉన్నది. ఆడపిల్లలు నాకిప్పుడు చెల్లెళ్ళలాకాక కూతుళ్ళలా కనబడుతున్నారు.

నా దురదృష్టమో ఏమో-నాక్లాసులోనికే ఒక అమ్మాయి చేరింది. పదహారేళ్ళ వయస్సు, అమాయకమైన ముఖం.

ఆమె అందరితోపాటుగాక నాలుగు రోజులు ఆలస్యంగా కాలేజీలో చేరింది

"నీపేరు?" అన్నాను.

"వరూధిని!" అన్నదామె.

క్లాసు క్లాసంతా గొల్లుమన్నారు. వెంటనే స్ఫురించక పోయినా తరువాత నాకు స్ఫురించింది. నాకు ప్రవరాఖ్యుడన్న పేరు ఎంతగా ప్రబలిందంటే - చాలా మంది విద్యార్థులకు నా అసలు పేరు తెలియదు

ఆమె పేరు నిజంగానే వరూధిని.... ఇది నాకు చాలా ఇబ్బంది అయింది. నాకొలీగ్సు నేను వినేలా - "ప్రవరాఖ్యుణ్ణి వెతుక్కుంటూ వరూధిని వచ్చిందోయ్-" అనేవారు.

ఆ తరువాత అనుకోకుండానే నాకూ వరూధినికీ మధ్య అనుబంధం ఏర్పడింది.

వరూధినికి క్లాస్‌టెస్టులో చాలా తక్కువ మార్కులు వచ్చాయి. బాగా తక్కువ మార్కులు వచ్చిన పదిమందిపేర్లు నేను బోర్డుమీద వ్రాశాను, ఆడపిల్లల్లో అలాంటి వారు ఇద్దరున్నారు. వారిలో వరూధిని ఉంది.

మార్కులు తక్కువ వచ్చిన వారిని నారూంకి రమ్మన్నాను. క్లాసుఅయిపోయాక అంతా నా రూంకి వచ్చారు. ఒక్కొక్కరినే పలకరించి వారి ట్రబుల్సు ఏమిటో తెలుసుకుని - ఇంప్రూవ్ కావడానికి ఏం చేయాలోచెప్పి పంపేశాను. ఆఖరున వరూధిని మిగిలింది.

"నాకు పుస్తకాలులేవు-" అన్నదామె ఏడుపు కంఠంతో.

అప్పుడు నేను వరూధిని గురించి తెలుసుకున్నాను. ఆమెకు అయినవారెవ్వరూ లేరు. అతి కష్టంమీద చదువు కొనసాగిస్తున్నది. ఏదో విధంగా బియ్యే డిగ్రీ తెచ్చుకోవాలన్నది ఆమె సంకల్పం.

నేనామెకు సాయపడతానని మాట యిచ్చి సాయంత్రం మా ఇంటికి రమ్మన్నాను. అలాగేనని తలూపిందామె.


వరూధిని గురించి ఇంట్లో శ్రీమతికి చెప్పి- "కాలేజీలో నాకు చాలా ఇబ్బందులుంటాయి. నేనామెకు సాయపడలేను. నీకామె నచ్చితే తోచిన సాయం చేయి. ఇంకమీదట ఆమె నిన్నే కలుసుకుంటుంది-" అన్నాను,

వరూధిని శ్రీమతిని కలుసుకుంది. శ్రీమతికి వరూధిని నచ్చింది. ఆ పైన వరూధినికి ఫీజు కట్టడానికీ, పుస్తకాలకూ ఇబ్బందిపడలేదు.

వరూధిని పెద్ద అందగత్తెకాదు. ముఖం కళగానే ఉన్నా- ఆమెకు మంచిదుస్తులు లేక

వసుంధర






అంత ఆకర్షణీయంగా ఉండదు. అం వల్ల ఆమెపేరు విద్యార్థుల నోళ్ళలో ఎకు వగా నానేదికాదు.

శ్రీమతికీ, వరూధినికీ మధ్య నానాటి అనుబంధం పెరుగుతున్నది. శ్రీమ వరూధినిని స్వంత చెల్లెలిలా చూసుకునే . ఒకోసారి సెలవురోజున ఇద్దరూ క బజారుకి వెడుతూండేవారు. సెలవ వరూధిని పనిగట్టుకుని శ్రీమతిని కల కునేది.

ఈ అనుబంధం నా కొలీగ్సుకి న లేదు. కొందరైతే నా శ్రీమతిని మె కుని- "భార్యంటే అలా సహకరించాలి " అనేవారు.

ఇలాంటివి విని సహించడం నేనునే కున్నాను. అయితే నేను సహించలేని శే షం ఒకటి జరిగి నాకు ప్రమాదం తె పెట్టింది.

కాలేజీలో మగపిల్లలు ఆడపిల్లలపట్ల కాస్త మోటుగా ప్రవర్తిస్తూంటారు- ఏ మాత్రం అవకాశం వచ్చినా!

కాలేజీలో లవర్స్ కార్నర్ అని ఒకటి ఉన్నది. అది ఆడపిల్లలకు ప్రమాదకర మైన చోటు.

వరండాలో కొంతదూరం తిన్నగా నడిచి పక్కకు తిరగాలి. ఆ పక్కన ఒకే ఒక క్లాస్ రూం ఉన్నది. ఆ క్లాస్ రూం అన్ని సమయాల్లోనూ ఉపయోగించబడదు. అందు వల్ల అక్కడ అస్తమానం జనసంచారం ఉండదు.

ఏదైనా క్లాసు ఉన్నప్పుడు కొందరు మగపిల్లలు అక్కడ ముందుగానే మాటు వేసి- ఆడపిల్లలు వచ్చే సమయం కనిపెట్టి వారు మలుపు తిరగ్గానే డాష్ ఇచ్చి- సారీ చెప్పి పారిపోతారు.

కొందరు ఆడపిల్లలు దీనికి మండిపడ తారు. కొందరు ఈజీగా తీసుకుంటారు. కొందరైతే ఇలాంటి అనుభవం కోసం ఎదురుచూస్తూంటారు. కానీ అలాంటివారు చాలా తక్కువమంది ఉంటారు. అలాంటి వారే ఎక్కువని మగపిల్లలుభావిస్తూంటారు.

పాపం ఆరోజు వరూధిని ఒంటరిదై పోయింది. పేదరికంవల్లనో, మరే ఇతర కారణాలవల్లనో ఆమె మిగతా ఆడపిల్లలలో అంతగా కలిసేదికాదు.

ఆరోజుఒంటరిగా ఆమె లవర్స్ కార్నర్ చేరుకున్నది. అక్కడ ఇద్దరు మగపిల్లలు మాటు వేశారని ఆమెకు తెలియదు.

ఒంటరిగా వరూధినిని చూసేసరికి వారు డాష్ ఇవ్వడం కంటే ఒకడుగు ముందుకు వేశారు. ఒకడైతే ఆమె జాకెట్ పట్టుకుని లాగాడు. అది ఎంత పాతగుడ్డో కాని- పర్రున చిరిగింది.

వరూధిని నిశ్చేష్టురాలై పోయింది.

పక్కనుంచి నేను మెట్లుఎక్కుతున్నాను. నా కళ్ళబడింది ఆదృశ్యం. ఒక్కఉదుటున అక్కడికి చేరుకున్నాను.

నన్ను చూస్తూనే ఓ కుర్రాడు అక్కణ్ణించి పారిపోయాడు. రెండోవాడు నా చేతికి దొరికాడు.

నాకు ఆవేశం ఆగలేదు. వాణ్ణి ఇష్టం వచ్చినట్లు ఈ చెంపా ఆ చెంపా వాయించి కాలరు పట్టుకుని ఎత్తి కుదేశాను. వాడి చొక్కా కూడా చిరిగింది.

ఈలోగా వరూధిని నిండా పైట కప్పు కుని ఏడుస్తూ అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

నేనాకుర్రాణ్ణి వదిలిపెట్టి నా క్లాస్‌రూంకి వెళ్ళాను. అయితే పాఠం సరిగా చెప్పలేక పోయాను. నా కనుల ముందు వరూధిని- ఆ కుర్రాడు- మాత్రమే మెదుల్తున్నారు.

ఎంత అమానుషంగా ఉన్నది - వాడి ప్రవర్తన?

ఆరోజు వరూధిని తర్వాత నా క్లాసులో కనబడలేదు. బహుశా తన హాస్టల్‌కు వెళ్ళి పోయి ఉంటుందనుకున్నాను.


మధ్యాహ్నం నా సహోద్యోగి ఒకడు వచ్చి- "నువ్వు త్రిమూర్తిని కొట్టావా?" అన్నాడు.

"త్రిమూర్తి ఎవరు?" అన్నాను.

"ఈ ఊరి కౌన్సిలర్ గారబ్బాయి-" అన్నాడు సహోద్యోగి.

"కౌన్సిలర్ కొడుకును నేనెందుకు కొడ తాను?" అన్నాను.

"ఏమో-నీమీద ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు వెళుతోందని విన్నాను. జాగ్రత్తగాఉండు" అని నా సహోద్యోగి నన్ను హెచ్చ రించాడు.




కాసేపటికి నాకు ప్రిన్సిపాల్ నుంచి పిలుపు వచ్చింది. అక్కడ త్రిమూర్తిని చూశాను. నా ఊహ తప్పుకాలేదు.

వాడే- వరూధిని జాకెట్ చింపినవాడు.

వాడి చొక్కా చిరిగి ఉంది. మనిషి ముఖం కమిలిపోయింది. ఒకన్ను చిన్నదిగా కనిపిస్తోంది!

"ఇతణ్ణి మీరు కొట్టారా?" అన్నాడు ప్రిన్సిపాల్.

"కొట్టాను-"

"ఎందుకని?"

"ఓ ఆడపిల్ల జాకెట్ చింపాడు....."

"చింపింది ఈయనేసార్.... అప్పుడు. నేనది చూశానని ప్లేటు పిరాయించాడు.." అన్నాడు త్రిమూర్తి.

నా రక్తం మరిగింది. "నిజం ఆపిల్ల చేతే చెప్పిస్తాను...."

వరూధినిచేత నిజం చెప్పించవచ్చునని నేననుకున్నాను. అప్పటికే నా చుట్టూ పెద్ద విషవలయం అల్లుకున్నదని నాకుతెలియదు.

వరూధినికీ నాకూ ఉన్న అనుబంధం ప్రిన్సిపాల్‌కు తెలిసింది. ఆమెకు నేను చేస్తున్న సాయం కూడా ఆయనకు తెలిసింది. అంటే మా ఇద్దరిమధ్యా ఏదో ఉండి ఉండాలి,....

కథనం ఎలాగున్నదంటే - వరూధినీ, నేనూ లవర్స్ కార్నర్ వద్ద పరసాలాడు కుంటూంటే త్రిమూర్తి చూశాడు. ఏం చేయాలో తెలియక నేను వాణ్ణి కొట్టాను. వరూధిని కూడా నాకు వత్తాసుపలుకుతుంది.

ఉన్నది అక్కడ ముగ్గురు. వరూధిని దెబ్బతిన్న మనిషి - ఆమె సాక్ష్యానికి విలువ లేదు. త్రిమూర్తి నేరం చేసిన మనిషి. వాడు మున్సిపల్ కౌన్సిలర్ కొడుకు.

"అయితే నేనిప్పుడేం చేయాలి?" అన్నాను.

"మీరు త్రిమూర్తికి క్షమార్పణ చెప్పుకోవాలి-" అన్నాడు ప్రిన్సిపాల్.

తెల్లబోయాను.

ప్రిన్సిపాల్ త్రిమూర్తిని బయటకు పంపించేసి నాతో ఏకాంతంలో ఇలా అన్నాడు- "మిస్టర్ రావ్! త్రిమూర్తి చాలా పవర్‌ఫుల్ మనిషి. స్టూడెంట్స్ యూనియన్ నాయకుడు. మునిసిపల్ కౌన్సిలర్ తనయుడు. మీరు క్షమార్పణ చెప్పుకోకపోతే అతడు విద్యార్థులచేత సమ్మె చేయించే ప్రమాదముంది-"

"అయితే అతడి తప్పు ఘనం సహించి ఊరుకోవలసిందేనా?"

"మీరు క్షమార్పణ చెబితే అతడు తప్పుచేయనట్లే గదా!"

ప్రిన్సిపాల్ నాకు అన్నీ వివరంగా చెప్పాడు.

తప్పు ఎవరివల్ల జరిగిందో ఆయన ఊహించగలడు. కానీ ఊహించడు.

చట్టానికి చెవులేకానీ కళ్ళులేవు. త్రిమూర్తి గొంతు పెద్దది.

త్రిమూర్తిని చెప్పుగొడితే ఈ రోజు అమ్మాయి జాకెట్ చింపాడు. రేపు చీర చింపుతాడు. నేను తప్పులో ఇరుక్కుంటాను. అటు నాజీవితం - ఇటు వరూధిని జీవితం నాశనమవుతుంది.

నేను త్రిమూర్తికి క్షమార్పణ చెప్పుకుంటే....

విద్యార్థులు సమ్మె చేయరు. వరూధినికీ నాకూ ఏసంబంధమూ అంటగట్టబడదు, నేను పరిస్థితిని అపార్థం చేసుకొని త్రిమూర్తిని కొట్టాను తప్పితే - తప్పు ఎవరి వల్లనూ జరుగలేదు. నేను త్రిమూర్తిని కొట్టడం మాత్రం తప్పు. నా తొందర పాటుకు నేను త్రిమూర్తిని మన్నించమని అడగాలి. అదీ విద్యార్థులందరి సమక్షంలో!

"బహుశా ఈపని నావల్లకాదు...." అన్నాను.

"ఒకరోజు గడువు ఇస్తున్నాను. ఆలోచించండి-"అన్నాడు. ప్రిన్సిపాల్.

నాకుక్రోషం వచ్చింది. ఏమీమాట్లాడకుండా బయటకు వచ్చేశాను. సాయంత్రం మామూలుగా ఇంటికి వెళ్ళాను.

శ్రీమతికి జరిగింది చెప్పాలనుకున్నాను.


"వరూధిని నాకు అంతా చెప్పింది-" అన్నది శ్రీమతి.

వరూధిని మా ఇంటికివచ్చి వెళ్ళిందట. ఆమెను త్రిమూర్తి కలుసుకుని క్షమార్పణ అడిగి వెళ్ళాడుట. ఏదో కుర్రతనం చేష్టగా వరూధిని సరిపెట్టుకున్నదట. అలా సరిపెట్టుకోవడమే ఆమెకు క్షేమమట.

"తర్వాత ఏం జరిగిందో తెలుసా?" అని శ్రీమతికి చెప్పాను.

అంతా విని శ్రీమతి భయంగానూ కోపంగానూ- "అయితే మీరు త్రిమూర్తికి క్షమార్పణ చెప్పుకుంటారా?" అన్నది.

"తప్పును మొదల్లోనే కాలరాయాలి. కరుస్తుందన్న భయమున్నా విషసర్పాన్ని




కర్రతో కొట్టి చంపడానికి ప్రయత్నించాలి-" అన్నాను.

శ్రీమతి మాట్లాడలేదు.

మర్నాడుదయం నిద్రలేచేసరికి వాష్ బేసిన్ వద్ద పెద్ద టూత్ పేస్టు ట్యూబు ఉన్నది. ఇంకా కొత్త ట్యూబు నేను కొనలేదు. ఎలా వచ్చిందీ అనుకుంటూండగా నాకు గుర్తు వచ్చింది. ఆరోజు ఏప్రిల్ ఫస్టు! ప్రతి ఏప్రిల్ ఫస్టుకీ మా పిల్లలు పాత ట్యూబును పెద్దదిచేసి ఉబ్బించి ఇలా పెడుతుంటారు.

నాకు తెలిసిపోతే వాళ్ళు చిన్నబుచ్చుకుంటారు.

నేను మామూలుగా ఆ ట్యూబువాడబోయి "అరే ఇందులోంచి పేస్టురాదేం?" అన్నాను.

"ఏప్రిల్ ఫూల్-" అనుకుంటూ పిల్లలు ఎక్కణ్ణించో వచ్చారు.

వాళ్ళ ముఖాల్లో ఆనందం చూస్తుంటే నాకెంతో ఆనందం కలిగింది. అప్పుడే నాకు అనిపించింది - నాపిల్లల ముఖంలో ఆనందం చూడడంకోసం నేను ఫూల్ని అయినా బాధపడడంలేదు. అటువంటప్పుడు విద్యార్థులను మాత్రం నాపిల్లలుగా ఎందుకు చూడలేను?

అప్పటి కప్పుడు నిర్ణయం తీసుకున్నాను.

కాలేజీలో నా నిర్ణయం విని ప్రిన్సిపాల్ హర్షించాడు.

వేలాది విద్యార్థుల మధ్య త్రిమూర్తికి క్షమార్పణ చెప్పుకొనడంకోసం నేను వేదిక నెక్కాను.

"నాది పొరపాటు అని అందరూ అంటున్నారు. పరిస్థితిని అపార్థం చేసుకోవడంవల్ల ఈ పొరపాటు జరిగింది అంటున్నారు. నా క్షమార్పణ మీ చేత సమ్మెను మానిపించగలిగితే, నాక్షమార్పణ మన కాలేజీ ఆడపిల్లలకు మాన సంరక్షణ కలిగిస్తే— హృదయ పూర్వకంగా నేను త్రిమూర్తిని మన్నించమని కోరుతున్నాను.

అయితే ఒక్క విషయం - ఇకముందైనా ఎవరైనా అత్యాచారంచేస్తూ నా కళ్ళబడితే అప్పుడూ అత్యాచారం చేసినవాణ్ణి నేను కొడతాను. నావల్ల పొరపాటు జరిగితే క్షమార్పణా చెప్పుకుంటాను-" అన్నాను.

నా మాటలు విద్యార్థులకు నచ్చాయి. త్రిమూర్తిని కూడా అవి కదిలించాయి.

వేదిక మీదనే ఈ మాటలని కళ్ళు తుడుచుకుంటున్న నా కాళ్ళమీద పడ్డాడు త్రిమూర్తి.

"తప్పుఎవరిదైనా గురువువించి క్షమను శిష్యుడు కోరకూడదు. ఇటువంటి తప్పు మనం మున్ముందు చేయకూడదు-" అన్నాడు త్రిమూర్తి.

త్రిమూర్తి తాననుకున్నది సాధించాడు. అందుకు నేను అవమానం అనుకోలేదు.

నా కొలీగ్స్ నన్నభినందిస్తూ-"మొత్తం మీద మీ వరూధినికోసం వేదిక నెక్కి త్రిమూర్తికి క్షమార్పణ కూడా చెప్పుకున్నారు-" అన్నారు.

త్రిమూర్తినేకాదు - విద్యార్థులు చేసిన చేసిన ఏతప్పునైనా క్షమించగలను. ఎందుకంటే వాళ్ళు కుర్రాళ్ళు! కానీ అధ్యాపక స్థానంలో ఉండి కూడా మీరు కూతురు లాంటి వరూధినిని- నా వరూధినిఅన్నారు. మిమ్మల్ని నేను క్షమించలేదు...." అని వాళ్ళవైపు చూడకుండా బయటకు వచ్చేసాను. ●

